క్లుప్తంగా

బతుకమ్మా.. మా తల్లి బతుకమ్మా



కిష్టారెడ్డిపేట శ్రీకాంటిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పటాన్‌చెరు టౌన్: ఎంగిలి పూల బతుకమ్మ సంబురాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మహిళలు సంప్రదాయం దుస్తులు ధరించి, తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, ఆడిపాడారు. పటాన్‌చెరు డివిజన్, అమీన్‌పూర్ పరిధిలోని కిష్టారెడ్డిపేట శ్రీకాంటి కాలనీలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు.

ప్రత్యేక పూజలు



మునిపల్లి(అందోల్): అమావాస్య సందర్భంగా భక్తులు దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం మండలంలోని అంతారం జీన్ముక్త సంస్థానంలో పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయిలకు సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహారాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నూతన నియామకం

జహీరాబాద్ టౌన్: వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా కాశీంపూర్‌కు చెందిన కొనింటి నర్సింలు ఎన్నికైయ్యారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా నర్సింలు, సహాయ కార్యదర్శులుగా రాజ్‌కుమార్, అశ్వాక్, శోభమ్మ, బిస్మిల్లా, కమిటీ సభ్యులుగా మచ్చేందర్, శివరాజ్, వాజిద్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు.

మొక్కల సంరక్షణ బాధ్యత

జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి



మొక్కలు నాటుతున్న డీఎస్పీ, తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం మన బాధ్యత తీసుకోవాలని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఝరాసంగం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి, నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిసరాలు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు, ఎస్‌ఐ నరేష్, ఎంపీడీఓ సుధాకర్, ఏపీఓ రాజ్‌కుమార్, ఏఎస్‌ఐ మల్లేశం పాల్గొన్నారు.

కార్మికులకు సన్మానం



జహీరాబాద్ టౌన్: గాంధీ జయంతిని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులు మల్లయ్యస్వామి దంపతులు బుధవారం పంచాయతీ కార్మికులను సన్మానించారు. మొగుడంపల్లి మండలంలోని ధనసరి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న మల్లయ్యస్వామి కొన్ని సంవత్సరాల నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని 11 మంది పంచాయతీ కార్మికులను ఘనంగా సన్మానించారు. తమ సేవలను గుర్తించి సన్మానించిన మల్లయ్యస్వామి దంపతులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగభూషణం ఉన్నారు.

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా గణపతి

నారాయణఖేడ్: దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఖేడ్‌కు చెందిన గణపతిని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గణపతి మాట్లాడుతూ.. జిల్లాలోని దళితుల సమస్యలపై నిరంతరం పోరాడతానని తెలిపారు. తనను ఎన్నుకున్న సంఘ రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి దేవీశరన్నవరాత్రులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని మహంకాళి దేవాలయం, టోల్‌గేట్ సమీపంలోని రామలింగేశ్వర దేవాలయం, రేణుక ఎల్లమ్మ దేవస్థానం, మహాదేవుని ఆలయాల్లో నేటి నుంచి దేవీశరన్నవరాత్రులు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయాల నిర్వాహకులు పేర్కొన్నారు. బుధవారం మహోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.



సదాశివపేట గాంధీచౌక్ వద్ద ..



కంగ్టి: ఎంపీపీ సమావేశ మందిరంలో..



పటాన్‌చెరు టౌన్: నివాళులర్పిస్తున్న నీలం మధు



సదాశివపేట రూరల్(సంగారెడ్డి): దుస్తులు పంపిణీ చేస్తున్న సీడీసీ చైర్మన్ రాంరెడ్డి



పటాన్‌చెరు: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ తదితరులు

స్ఫూర్తి ప్రదాతకు నివాళి

మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. అహింసా మార్గంలో పోరాడి భారతీయులకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని అందించారని కొనియాడారు.

–సాక్షి, నెట్‌వర్క్



నివాళులర్పిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్, తదితరులు



న్యాల్‌కల్‌లోని రైతు వేదికలో..



కల్హేర్: రెవెన్యూ కార్యాలయంలో..



మునిపల్లి(అందోల్): తహసీల్దార్ కార్యాలయంలో..



జహీరాబాద్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

మహిళలు స్వశక్తితో ఎదగాలి

విశ్రాంత న్యాయమూర్తి పీవీ రాములు

జహీరాబాద్ టౌన్: మహిళలు స్వశక్తితో ఎదిగేలా ప్రయత్నాలు చేయాలని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి(తెలంగాణ లోకాయుక్త) పీవీ రాములు పేర్కొన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ సర్వీసెస్ (వికాస్) మహిళా స్వశక్తికరణ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన కొత్తకాపు లక్ష్మారెడ్డి స్థాపించిన వికాస్ సంస్థ ద్వారా మహిళలు నైపుణ్యం పెంచుకుని అభివృద్ధి చెందాలన్నారు. జహీరాబాద్‌లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వికాస్ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మహిళల ఉపాధి కోసం సంస్థను ఏర్పాటు చేశామని, ఇనిస్టిట్యూట్ స్థాపించి నేటితో 10 సంవత్సరాలు పూర్తి అవుతుందన్నారు. మహిళల నైపుణ్యాభివృద్ధికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఇప్పటి వరకు 180 శిక్షణ తరగతులు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్ గౌరవ కార్యదర్శి సుర రాజగోపాల్‌రెడ్డి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.సురేందర్‌రెడ్డి, సహాయ కోఆర్డినేటర్ ఎన్, రాంచంద్రారెడ్డిలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీ రాములు వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ సర్వీసెస్(వికాస్) బుక్‌లెట్‌ను విడుదల చేశారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న పీవీ రాములు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్

పటాన్‌చెరు టౌన్: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ అన్నారు. బుధవారం గాంధీ జయంతి నేపథ్యంలో 'స్వచ్ఛతా హీ సేవ -2024' కార్యక్రమంలో భాగంగా 'స్వచ్ఛ భారత్ దివస్' ని ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ప్రాంతీయ కార్యాలయం వద్ద శ్రమదానం, మొక్కలు నాటారు. అనంతరం నిత్యం కార్యాలయాన్ని శుభ్రం చేసే కార్మికులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతే మన ఆరోగ్యానికి భద్రతని, అందరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పీఎఫ్ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విశాల్ అగర్వాల్

ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు సరికాదు

కల్హేర్(నారాయణఖేడ్): మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పలువురు కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. బుధవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోచయ్య, నర్సింహారెడ్డి విలేకరులతో మాట్లాడారు. నల్లవాగు నీటిని విడుదల చేయకుండా ఎమ్మెల్యే సంజీవరెడ్డి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని నిరాధరమైన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, సంజీవరెడ్డి, రవీందర్‌రెడ్డి, గోపాల్, శ్రీనివాస్‌గౌడ్, పాల్గొన్నారు.

మాధ్వార్‌లో భోగ్‌బండార్

నారాయణఖేడ్: మండలంలోని మాధ్వార్ తండాలో బుధవారం భవానీమాత, సంత్‌సేవాలాల్ మహరాజ్ భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. భవానీమాత దీక్షాధారులు బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ మాట్లాడుతూ.. సేవాలాల్ మహరాజ్ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని, దురలవాట్లు, మూఢనమ్మకాలకు దూరం ఉండాలని కోరారు. పూజారి రాములు, సంఘం బాధ్యులైన దీక్షాధారులు రాజు నాయక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీజేపీ సభ్యత్వ నమోదు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని ఆయా గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. బుధవారం న్యామతాబాద్ గ్రామంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. నాయకులు ఓంకార్, మల్లేష్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్ : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. బుధవారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బాపుఘాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు 13.5 కిలోమీటర్ల మెట్రోరైలు ప్రాజెక్టును అంగీకరించడం వల్ల లక్షలాది మందికి మెట్రో రవాణా సౌకర్యం కలుగుతుందన్నారు. ప్రజలు, కార్మికులు, విద్యార్థులకు సమయం కలిసొస్తుందని తెలిపారు. మెగా డీఎస్సీతో సుమారు 11వేల మందికి ఉద్యోగ అవకాశం వస్తుందన్నారు. అలాగే, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న నరసింహారెడ్డి

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పటాన్ చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పటాన్ చెరు డివిజన్‌లో డీసీఎం డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్లు మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని, అలా చేయడం వల్ల ప్రమాదాలు జరిగి, అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని.. కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు. అదే విధంగా వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయరాదన్నారు. వాహనాల ఇన్సూరెన్స్ ఇన్‌టైంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య మాట్లాడుతూ.. ట్రాన్స్‌పోర్టు కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు, డీసీఎం డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కృష్ణలు ప్రసంగించారు. అనంతరం యూనియన్ గుర్తింపు కార్డులను సీఐ ప్రవీణ్‌రెడ్డి డ్రైవర్లకు అందజేశారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ ఆసిఫ్ అలీ, డీసీఎం యూనియన్ నాయకులు ఋషి, అతిక్, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌రెడ్డి

రక్తదానంతో ప్రాణదానం

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: రక్తదానంతో మరోకరికి ప్రాణదానం చేయొచ్చని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. మహాత్మాగాంధీ, మాజీ ఎమ్మెల్యే కిష్టారెడ్డి జయంతిలను పురస్కరించుకుని బుధవారం ఖేడ్‌లో లయన్స్ క్లబ్, కిష్టారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ అహింసా మార్గంలో దేశస్వాతంత్ర్యానికి కృషి చేయగా, తన తండ్రి కిష్టారెడ్డి ఎమ్మెల్యేగా ఈ ప్రాంతానికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఆయన చూపిన బాటలో పయనిస్తూ ఈ ప్రాంతవాసులకు సేవలు అందిస్తానన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కా ర్, వైస్ చైర్మన్ దారం శంకర్, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వినోద్ పాటిల్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సంగారెడ్డిలో భారీ వర్షం

కాలనీలు జలమయం

సంగారెడ్డి జోన్: పట్టణంలో అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. రెండు గంటల పాటు ఉరుములు, మెరుపులతో దంచికొట్టింది. 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ప్రధాన రహదారులపై వరద నీరు నిలిచి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పట్టణంలోని పలు కాలనీలు, అపార్ట్‌మెంటు ల్లోకి నీరు చేరి ప్రజలు నానా అవస్థలు పడ్డారు. పంట పొలాల్లోకి వరద నీరు చేరడంతో అన్నదాత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇళ్ల మధ్యలో నిలిచిన వరదనీరు

సంక్షిప్త వార్తలు

◆ ఉపాధి ప్రణాళికలపై గ్రామసభ



కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధిహామీ పనుల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ సత్తయ్య పేర్కొన్నారు. మండలంలోని బోర్గి సర్దార్ తండాలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామం, శివారుల్లో చేపట్టాల్సిన పనులు, కల్పించాల్సిన పనిదినాలు, అభివృద్ధి పనుల గురించి ఉపాధి కూలీలతో చర్చించి ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. నవంబర్ 30 వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రణాళికల తయారీకి ఉపాధిహామీ అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, ఉపాధికూలీలు పరస్పరం సహకరించుకోవాలన్నారు. ఎక్కువ మంది ఉపాధి కూలీలు పనులకు హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానికులు, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

◆ న్యాల్‌కల్‌లో..

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. కార్యదర్శుల సమక్షంలో గ్రామసభలు ఏర్పాటు చేసి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు.

◆ కల్హేర్‌లో..

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలంలో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. పోట్‌పల్లి, ఉజలంపాడు, సూర్య తండా, తదితర పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం, అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్సూర్, ఎంపీఓ బ్రహ్మం, ఏపీఓ బస్వరాజ్, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

◆ రోడ్డుకు మరమ్మతులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం తెల్లాపూర్‌లోని రేడియల్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి పరిధిలోని గోపనపల్లి తండా నుంచి కొల్లూరు రింగ్ రోడ్డు వరకు నిర్మించిన రేడియల్ రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో పనులు చేపట్టారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నారాయణఖేడ్: మండలంలోని జగన్నాథ్‌పూర్‌కు చెందిన పోచమ్మ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో సీఎం సహాయనిధి నుంచి రూ.14వేలు చెక్కు మంజూరయింది. బుధవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బాధితురాలి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు.

◆ ముగిసిన 'స్వచ్ఛతా హీ సేవ'

జోగిపేట(అందోల్): అందోల్ -జోగిపేట పురపాలక సంఘంలో 'స్వచ్ఛతా హీ సేవ' ముగింపు సందర్భంగా జోగిపేటలో మాస్ క్లీనింగ్ కార్యక్రమం చేపట్టారు. బుధవారం గాంధీ పార్కులోని మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కమిషనర్ తిరుపతి, వైస్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.వినయ్, ఆర్.ఐ.నారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

◆ సీపీఎం కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సీపీఎం పార్టీ సదాశివపేట ఏరియా నూతన కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్‌ను తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యుడిగా భూషణం, అనిల్, రమేశ్‌గౌడ్, నర్సింలు, ఏసోబు, ఖయ్యూం, దశరథ్ ఎన్నికయ్యారు.

◆ చర్యలు తీసుకోండి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: డీఎస్సీ 2024 మెరిట్ అభ్యర్థులు 1:3 నిష్పత్తిలో భాగంగా ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చే సమయంలో అభ్యర్థుల సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎస్‌జీటీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్ కోరారు. ఈ మేరకు డీఈఓను కలిసి వినతిపత్రం అందజేశారు. నకిలీ ధ్రువపత్రాలు తీసుకొని వస్తే అసలైన మెరిట్ అభ్యర్థులకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్‌జీటీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల కిష్టయ్య, నాయకులు వసంత్, డీఎస్సీ మెరిట్ అభ్యర్థులు ఉన్నారు.

◆ ఎల్‌ఆర్‌ఎస్‌ను అమలు చేయాలి

జహీరాబాద్ టౌన్: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్ కోరారు. ఆయన మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎలాంటి రుసుజ లేకుండా ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేస్తామని ప్రకటించిందన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ అబ్దుల్లా, మాజీ పట్టణ అధ్యక్షుడు యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

◆ కార్మికులకు అవార్డుల అందజేత

నారాయణఖేడ్: 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం కమిషనర్ జగ్జీవన్, చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారంశంకర్ శాలువాలతో సన్మానించి, అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కోర్టుకాలనీలో మాస్ క్లీనింగ్ పనులు చేపట్టి, మొక్కలు నాటారు.

◆ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

పటాన్‌చెరు: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కోరారు. బుధవారం మహిళలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

కుల రహిత సమాజమే లక్ష్యం

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం



ఆవిష్కరణలో పాల్గొన్న కేవీపీఎస్ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కులరహిత సమాజమే లక్ష్యంగా కేవీపీఎస్ పనిచేస్తోందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం పేర్కొన్నారు. కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలోని సుందరయ్య భవన్ వద్ద సంఘం జెండాను ఆవిష్కరించారు. మాణిక్యం మాట్లాడుతూ.. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన, అంటరాని తనం, కులవివక్ష వ్యతిరేకంగా కేవీపీఎస్ 1998 అక్టోబర్ 2న ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటుకు దశలవారీ పోరాటాలు నిర్వహించి జస్టిస్ పున్నయ్య కమిషన్ సాధించిన ఘన చరిత్ర కేవీపీఎస్‌దేనని అన్నారు. ఎస్సీ , ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు కేటాయించాలని పోరాడి 2013 లో చట్టం సాధించిందన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, జిల్లా సహాయ కార్యదర్శులు ప్రవీణ్‌దాస్, జిల్లా కమిటీ సభ్యులు దత్తు, మహేశ్ పాల్గొన్నారు.